# సత్తురూపాయి

'ఓలమ్మో: నానేటిసేతునే...' గంగ గుండె తెగేలా యేడుస్తూంది.

పొరుగింటి ముసిల్ది ఏడాదినిండని పిల్లణ్ణి ఒళ్ళో పడుకోబెట్టుకుంది. పిల్లడి చూపు పక్కకెళ్ళిపోయింది. ప్రాణం పోవడానికెంత సేపో పట్టదు.

సముద్రపొడ్డు ప్రక్కనేఉన్న గోతులు గాతల్లో భూమిలోకి కూరుకుపోయినట్టున్న గుడిశల్లో అప్పల్సూరిదొకటి. సూరి దొరికినప్పుడు కూలి చేస్తాడు. దొరికినదాంట్లో మూడొంతులు సారా తాగేస్తాడు.

గంగ కూడా కూలి చేస్తుంది. మొగుడుతెచ్చిన పావలా అర్ధా తను సంపాదించింది కలిపి గంజి కాస్తుంది. తరుచు పస్తులు వాళ్ళకలవాటే.

గంగ అగ్నిప్రవేశం చేసి బైటకొచ్చిందికాదు. అగ్గిలోంచి బైటకొచ్చి అప్పల్సూరితో మనువుంది.

అవాళ ఊరు తెల్లవారకుండానే అప్పల్సూరి ఇల్లు విడిచిపెట్టేడు. ఆదుర్దాగా యేడాది నిండని సింహాద్రికి జబ్బుచేసింది. గంగ యిల్లు కదల్లేక పోయింది. ఇంట్లో పిడికెడు నూకల్లేవు, పైసాలేదు.

పిల్లణ్ణి ఆస్పత్రికి తీసికెళ్తే అక్కడ దిక్కుమాలినవాళ్ళని చూసే వాళ్ళలేరు. రోగం ముంచుకొచ్చింది. దగ్గరున్న డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళింది. డాక్టరు పిల్లణ్ణి పరీక్షించేడు. తల్లిని యెగాదిగా పరీక్షించేడు. చీటియిచ్చి

'యీ ఇంజక్షన్ తీసుకురా వేగం' అన్నాడు. గంగ యేదో చెప్దామనుకుంది. డాక్టరు తెరతొలగించుకొని లోపల గదిలోకెళ్లిపోయేడు. గంగ ప్రాణంపోతున్న కొడుకుని ప్రాణాలు తోడేసే చీకటిని పట్టుకుని గుడిశ కొచ్చింది.

పొద్దు నడినెత్తిమీద కొచ్చేసరికి పిల్లడిచూపు నిలిచిపోయింది.

'ఈ సవాదిగోడు యింకా కొంపసేర్నేదు.' గంగ కడుపులో గాభరా యెత్తిపోయి అనుకుంది.

సూర్యుడు యెర్రబారి పడమటి దిక్కున జారిపోతున్నాడు. సముద్రంమీద కారు మేఘాలు వేళ్ళాడున్నాయి. ఊరుమింగడానికి చీకటినోరు విచ్చుకుంటూంది.

'ఊరు తెల్లారకుండాపోనాడు. ఎందంట తిరగతన్నాడో సచ్చినోడు. మద్దినేల గెంజికన్నా రానేదు. నానేంసేతున్నా బగమంతుడా...' గంగ సోకాలందుకుంది.

ఉండుండి పిల్లడి గొంతులోంచి గురకలాంటి శబ్దం వస్తూంది. ఆ శబ్దం విన్నప్పుడల్లా గంగ భయంగా అటుచూసి 'ఓలమ్మో! సివాంద్రీ, నోర్నేనోడువి నువ్వే దొరికావురా ఆ దేవుడికి' కుములుతుంది.

ఆ పిల్లాడికేసి చూళ్ళేకపోతూంది. మృత్యుదేవతలా పిల్లడ్ని వొళ్ళో పెట్టుకున్న ముసిల్దాన్ని ఓమారు కన్నీళ్ళలోంచి చూసింది. బీచంతా చీకటి. చీకటికేసి బెంగగా చూసింది. గుడిశ బైటకొచ్చి వెర్రిగా నాలుగువేపులా చూసింది.

'ఎక్కడ సచ్చావురా మావా! సింవాద్రిగోడి పానాలు పోతున్నాయిరా' అరిచింది.

అప్పల్సూరి పరిగెత్తుకొచ్చి గుడిశలో దూరేడు, అతని కాళ్ళు వణికేయి.

'ఏటే పెద్దమ్మా యిదంతా!'

ముసిల్ది తలెత్తకుండానే అంది. 'ఏటో రోగం ముంచుకొచ్చింది. పొద్దుటి కాణ్ణించి యినాగే వున్నాడు, సూపెపుడో నిలబడిపోనాది. ఇపుడీ గురకోటి. డాట్టరుబాబు కాడికి తీసికెల్తే సీటిచ్చి, యిండీశనట్టుకురమ్మన్నాడు. గంగకాడ నయాపైసానేదు. ఎంతవుద్దో ఆ యిండీసినికి...' ముసిల్ది వొణుకుతున్న గొంతుతో అంది.

అప్పల్సూరి వొక్కక్షణం కొయ్యబారిపోయేడు. గంగ అతని గుండెల మీద చేతులేసి బైటకి నెట్టుతూ 'ఎల్లా మావా! పరిగెత్తి కెళ్ళి యిండీసనొట్రారా. ఆడిపానాలు పోతే నాను గంగలో దూకుతాన్రా. ఎల్లా, మాటలు తడబడుతూ యేడుస్తూ అంది.

అప్పల్సూరి గుడిశెలోంచి రివ్వున బైటకొచ్చి మెరుపులా మాయమయ్యేడు. గంగ గోడు గోడుమంటూ తలబట్టుక్కూలబడింది.

ఆరు దాటింది. ప్రక్కనే ఉన్న చర్చిలో గంట మ్రోగింది. ఎనిమిది కూడా దాటింది. అప్పల్సూరి ఇంకా తిరగిరాలేదు.

సింహాద్రి గొంతులో గురక తగ్గింది.

చీకటిలో, గుడిశలో పొగకక్కుతున్న దీపం నృత్యం చేస్తూంది.

'పానాలు పోయినప్పుడు అన్నిరోగాలూ తగ్గిపోతాయి గావునాని దేవుడా, ఈ మావ సచ్చినోడు యెందలెక్క తిరుగుతున్నాడో...' గంగ.

గంగ గుడిశలో నిలవ లేకపోయింది. బైటకొచ్చి యిటూ అటూ వెర్రిగా చూసింది. గుడిశలో గుడ్డిదీపం వెలుగులో ముసిల్ది దెయ్యంలా వుంది. గంగ సముద్రంవేపు గబగబా నడిచింది.

రొజ్జగాలి వీస్తూంది. సముద్రం యమలోకంలో చీకటిలా వుంది. సముద్రంలోంచి లేచిన యారాడకొండ ఎనుబోతులావుంది. ఆ కొండమీద గిరగిర తిరుగుతున్న దీపం యముడు తిప్పుతున్న ఉచ్చుతాడులా వుంది.

గంగ పూనకం పట్టినదాన్లా నడిచింది. సముద్రపుహోరులో యేమీ వినిపించడంలేదు. బీచంతా చీకటి అంధకారం. గంగ 'పాత లైటుహౌసు' వేపు పరిగెట్టినట్టు నడిచింది.

చీకట్లో అట్నించి యెర్రగా 'బీడీ' వస్తూంది. బీడీ యెరుపుసరిగ్గా ఆమె మొహం ముందు ఆగింది.

'రూపాయి కావాలా ?'

గంగ తల కొండమీద దీపంలాగే తిరిగిపోయింది. నూరు తేళ్ళు కుట్టినట్లయింది.

'ఇదేటోలమ్మ ఒల్లంత ఐసునాగ సల్లబడి పోతంది' ముసల్దిమూలిగి నట్లయింది గంగ గుండెలో.

'ఏటాలోసిత్తన్నావు. రూపాయి కావాలంటే 'సెల్టరు'లోదూరు బీడీ నవ్వుతూ అంది.

గంగ వొక్క వుదుటున 'ఏ.ఆర్.పీ. షెల్టరు'లో దూరింది.

లోపల గాడిదల, పందుల కంపు ఏవో పారేసిన కుళ్లగుడ్డపీలికల్లా మెత్తగా, గచ్చూడిపోయిన నేలగోతులు. గంగ కళ్లు గట్టిగా మూసుకుంది. ఆ నరకకూపంలోనే సింహాద్రప్పన్నకి మొక్కుకుంది. 'తండ్రీ నా సింవాద్రి గురక ఆపెయ్యకు' అని. గొంతులో గురకంటూవుంటే, 'ఇండీసను' పడితే వాడు తప్పకుండా బతుకుతాడని ఆశ.

బైట బీడీ యింకా యెర్రగా వెలుగుతూ, యిటూ అటూ తిరుగు తూంది. రెండోవేపునుంచి వో ఆకారం వస్తూంది. బరువుగా కాళ్ళీడ్చు కుంటూ సరిగ్గా బీడీ దగ్గిరాగింది ఆకారం.

'కావాలా ? రూపాయ్... నాకో పావలా... సెల్టర్లోవుంది...' వర్తక సరళిలో మర్యాదగా అంది బీడీ.

ఈ చీకటి బజార్లోకూడా పెద్దమనుషుల చీకటి బజార్లోలాగే మర్యాద వుంది. అయితే ఈ బజారు చీకటి పరిమితం. ఆ బజారు చీకటి అపరిమితం.

ఆ ఆకారం సముద్రం వెంపోసారి చూసి, పావలాకాసు బీడీచేత్తిలో పెట్టి, షెల్టరులో మారింది. పదినిముషాలు పోయేక బైటకొచ్చి సముద్ర పొడ్డునున్న పిట్టగోడమీద కూలబడింది.

గంగ కోక సర్దుకుంటూ గుడిశవేపు గబగబ నడిచింది. చీకట్లో ఆత్రుతతో, ఆశతో, పిల్లడి ప్రాణం కోసం ఒళ్ళమ్ముకుంది. తల్లి గుండె! ఒళ్ళు నాశనం అవుతుంది. తల్లిగుండెకి నాశనం లేదు.

సముద్రంలో యిదివరకులాగే యెత్తైన అలలు లేచిపడుతున్నాయి. రొజ్జగాలి వీస్తూంది. కొండమీద దీపం తిరుగుతూంది.

'పెద్దమ్మా...మావ రానేదా...?' గంగ ఆతృతగా అడిగింది.

'ఉహుఁ' పెద్దమ్మ తలెత్తకుండానే మూలిగింది.

'అయ్యో సచ్చినోడు, సీటీ వొట్టికెలిపోండు, ఇండీసిన్ తెచ్చిందీ నేదు సచ్చిందీనేదు. తొమ్మిద్దాటిందిగావాల మందుల సాపులు మూసేత్తారో యేటో' గంగ.

'ఒల్లు సల్లబడిపోతాందే...' ముసల్ది మూలిగింది.

'ఒలమ్మో! నానేటిసేతునే...నాకాడ రూపాయుండే, కాని ముండా సీటీ సచ్చినోడు వొట్టుకెలిపోయిండు. నన్ను న్యాయం సెయ్యకు సింహాద్రప్పన్న తండ్రీ...' గంగ కూలబడి జుత్తుపీక్కుంది.

అప్పల్నారి గుడిశలోకొచ్చి నిస్సత్తువగా నిలబడ్డాడు. గంగ దిగ్గున లేచింది.

'ఏడబోయావురా మావాఁ! ఇండీసిన తెచ్చావా...!' ఆతృతగా అడిగింది.

'నేదే...' నీరసంగా అన్నాడు.

'ఏం?'

'నాకాడున్నది సత్తురూపాయే...ఎన్నో మందుల్సాపులు కాడకెల్లి సీటీ సూపించి రూపాయిస్తే సాపులోల్లు రెండూ నామొకానకొట్టి పొమ్మన్నారు...పానం యిసికి సత్తురూపాయ గంగలో యిసిరిపారేశా...'

'ఇదట్టుకెల్రా-సెట్టిని బతిమిలాడితే అప్పిచ్చిండు-బేగెల్రా... దుకానాలు కట్టేస్తారు...' రూపాయి మొల్లోంచితీసి యేడుస్తూ అంది గంగ.

గెంతుతూన్న గుడ్డిదీపం వెలుగులో గంగ చేతిలోవున్న రూపాయికేసి అప్పల్స్వారి నిగానిగా చూసేడు. చెవుల్లో సముద్ర తరంగాల మోత మోగింది. కొండమీద దీపం తన తలమీదే గిరగిరా తిరుగుతూంది.

చిట్టచీకటి కమ్మింది. చీకట్లో యెర్రయెర్రగా బీడీకొస రగుల్తూంది.

'గంగా...! సెల్లర్లో నువ్వేనేటే?' భయంకరంగా అరిచేడు.

ఈమాటు కొండమీద దీపం గంగ నెత్తిమీద గిరగిరా తిరుగుతూంది. శరీరంలో నెత్తురంతా మొహంలోకొచ్చింది.

'సెల్లర్లో...!' అని యెడతెరిపి లేకుండా కారుతూన్న కన్నీటితో, వొణికిపోతున్న గొంతుతో యేదో అనబోయింది గంగ.

'అది సత్తురూపాయ్...సెల్లదు...' అప్పల్స్వారి నీరసంగా అన్నాడు.

'మన బతుకులే సత్తురూపాయల్రా...' అని ముసిల్ది సింహాద్రిని నేలమీద పడుకోబెట్టి, కుక్కి నులకమంచంమీదున్న చింకులపాత వాడిమీద కప్పింది.